క్లుప్తంగా

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు



అప్పనపల్లిలో సంక్రాంతి సంబరాల కోసం ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి క్షేత్రంలో సంక్రాంతి సందడి నెలకొంది. స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు ఆదివారం పలువురు విరాళాలు అందించారు. పి.గన్నవరం మండలం ముంగండకు చెందిన డాక్టర్ విశ్వనాథ్ రూ.18 వేలు విరాళం అందించారు. పోడూరుకు చెందిన ముదునూరి కిశోర్‌కుమార్, కృష్ణవేణి దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. దాతలకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఈఓ సత్యనారాయణరాజు దాతలను అభినందించారు.

లక్ష్మీనృసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయంలో నిత్యం నిర్వహించే నారసింహ సుదర్శన హోమంలో కూడా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిత్యాన్నదాన పథకంలో దేవస్థానం భోజన వసతి కల్పించింది. భక్తులకు ఏ విధమైన అసౌకర్యం లేకుండా క్యూలైన్లను, మంచి నీటి సదుపాయాలను ఆలయ ఏసీ వి.సత్యనారాయణ పర్యవేక్షించారు. కాగా స్వామిని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబ సమేతంగా దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనాలు పలికారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ ఎం.సత్య కిరణ్, ఆయనకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

ఘనంగా లక్ష చామంతి పూజలు

అంబాజీపేట: ధనుర్మాసం సందర్భంగా మండలంలోని గంగలకుర్రులో లక్ష చామంతి పూజలు నిర్వహించారు. గ్రామంలో వేంచేసిన ఉమా పార్వతీ సమేత చెన్న మల్లేశ్వర స్వామి, రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో లక్ష చామంతి పూజలను గ్రామానికి చెందిన జయంతి భాస్కర సుబ్రహ్మణ్యం దంపతులు నిర్వహించారు. సుందరకాండ పారాయణ, సహస్ర లింగార్చన ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు పూజ్యం సుబ్రహ్మణ్యశర్మ సోదరులు సూరిబాబు, శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో మదనగోపాలస్వామి ఆలయంలో అర్చకులు పెద్దింటి నవగోపాలాచార్యుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

నాయుడుకు తెలుగు కీర్తి పురస్కారం



మోరం వెంకయ్యనాయుడు

సఖినేటిపల్లి: మండలంలోని టేకిశెట్టిపాలెంకు చెందిన సీనియర్ కళాకారుడు, బుల్లితెర నటుడు మోరం వెంకయ్యనాయుడు జాతీయ తెలుగు కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. ఆదివారం ఆయన వివరాలను మీడియాకు చెప్పారు. ఇందుకు సంబంధించిన సమాచారం శ్రీశ్రీ కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ నుంచి వచ్చిందన్నారు. ఈ మేరకు శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ ఆఫ్ రికార్డ్స్ నుంచి పై పురస్కారాన్ని ఈ నెల 21న విజయవాడలో నిర్వహించే సాహిత్య కార్యక్రమంలో అందుకోనున్నట్టు నాయుడు అన్నారు.

భువిక కుటుంబానికి సాయం



భువిక కుటుంబానికి సాయం అందిస్తున్న తాడి మురళి తదితరులు

మలికిపురం: మండలంలోని పడమటిపాలెం గ్రామం తాడి వారి గ్రూపులో అనారోగ్యంతో చిన్నారి తాడి భువిక ఇటీవల మృతి చెందింది. ఆమె ఆరోగ్యం కోసం ఆర్థిక ఇబ్బందులు పడిన కుటుంబ సభ్యులను తాడి సంక్షేమ సంఘం తరఫున కలసి వారికి మనోధైర్యం చెప్పారు. సంఘం నుంచి రూ.20,500 సమాకూర్చి, ఈ సహాయాన్ని మాజీ సర్పంచ్ తాడి మురళీధర్ చేతుల మీదుగా భువిక కుటుంబ సభ్యులకు అందించారు.

ఎనిమిది మందిపై పిచ్చికుక్క దాడి

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేశాయి. గ్రామంలోని 8 మందిపై దాడి చేసి గాయపరిచింది. వీరికి వీరవల్లిపాలెం పీహెచ్‌సీ సిబ్బంది వైద్యం చేసి మందులు అందజేశారు. పిచ్చికుక్కలు ఎక్కువ ఉండటంతో వాటిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభల తీర్థాలకు సర్వం సిద్ధం

- నేడు భోగి
- ప్రభల తయారీలో ప్రజల నిమగ్నం
- తీర్థాలకు సర్వం సిద్ధం



కేశనపల్లిలో సందడి చేస్తున్న గంగిరెద్దుల ప్రదర్శన



పోతాయిలంకలో భోగి మంటకు దుంగలు సిద్ధం చేస్తున్న యువకులు

మలికిపురం: సంక్రాంతి అనగానే కోడిపందేలు, ప్రభల తీర్థాలు, గుండాటలు నిర్వహించడం పరిపాటి. కానీ కోనసీమలో మాత్రం ప్రభల తీర్థానికి ఎంతో విశిష్టత ఉంది. కొన్ని వందల ఏళ్ల నుంచి ప్రభల సంప్రదాయం ఇక్కడ కొనసాగుతోంది. దానిని ఈ తరం వాళ్లు కూడా కొనసాగిస్తున్నారు. అలాగే మహిళలు తమ లోగిళ్ల ముందు రంగురంగుల ముగ్గులతో పాటు సంక్రాంతి గొబ్బెమ్మలను ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం భోగి పండగ నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో తెల్లవారుజామున భోగి మంటలకు ఏర్పాట్లు చేశారు. సంప్రదాయం ప్రకారం కొత్త అల్లుళ్లను, వియ్యపురాళ్ను కూడా పండక్కి పిలిచి మర్యాదలు చేయడం కోనసీమ సంప్రదాయం. అందులో భాగంగా వారిరువురిని పిలిచి పండగకు సిద్ధమయ్యారు. వివిధ రకాల పిండి వంటలతో ఇంటిల్ల పాదితో పాటు బంధువులకు కూడా విందులు చేసుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఉద్యోగ నిమిత్తం దూర ప్రాంతాల్లో ఉంటున్న వారు కూడా కుటుంబ సమేతంగా సొంత ఊళ్లకు వచ్చి పండగ చేసుకున్నారు.

ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

సంక్రాంతి నేపథ్యంలో పలు గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. శివకోడుతో పాటు మోరి పుంతలో ముసలమ్మ, అప్పనరామునిలంక ముత్యాలమ్మ, శంకరగుప్తం, చింతలమోరి, కేశనపల్లి, పడమటిపాలెం, కరవాక తదితర గ్రామాల్లో అమ్మవార్ల తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి. కేశనపల్లి తూర్పుపాలెం, పడమటిపాలెం గ్రామాల్లో ప్రభల ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు జరిగాయి. ఈ గ్రామాల్లో నీలపల్లమ్మ తీర్థం ఘనంగా జరుగుతుంది. పలు ప్రాంతాల నుంచి ప్రభల ఊరేగింపునకు భారీగా ఏర్పాట్లు జరిగాయి. ఇక కోడి పందాలకు పేరొందిన రాజోలు దీవిలో పందెం రాయుళ్లు భారీగా ఏర్పాట్లు చేశారు. కోడి పందాలకూ, సంక్రాంతికి విడదీయరాని బంధం ఉంది. అందునా రాజోలు నియోజకవర్గంలో పోలీసులు అష్ట దిగ్బంధం చేసినా కోడి పందెం ఆగదు, ఇక చివరి నిమిషంలో అయినా సరే పందేలకు అనుమతి వస్తుందని పందెం రాయుళ్లు అపార విశ్వాసంతో ఉన్నారు. ఆ విశ్వాసంతోనే లక్షల రూపాయలతో పందెం కోళ్లను, బరులను సిద్ధం చేశారు. బరులకు భారీగా వేలం పాటలకు వెళ్లినట్లు సమాచారం. రాజోలు దీవిలో లక్కవరం, వీవీ మెరక, మోరిపోడు, చింతలపల్లి, సఖినేటిపల్లి, పడమటిపాలెం, శంకరగుప్తం, రామరాజులంక, సఖినేటిపల్లిలంక, రామేశ్వరం, పొన్నమండ, గోగన్నమఠం, బి.సావరం తదితర గ్రామాల్లో పందాలకు బరులు సిద్ధమయ్యాయి.

భోగి మంటలకు దుంగలు సిద్ధం

అంబాజీపేట: మూడు రోజుల సంక్రాంతి పండగల్లో మొదటిదైన భోగి పండగ నిర్వహించేందుకు యువకులు, చిన్నారులు సిద్ధమయ్యారు. రైతుల వద్ద ఉన్న కొబ్బరి తదితర దుంగలను పోగుచేసి తీసుకొస్తున్నారు. పూర్వం అయితే ప్రతి ఇంటికీ వెళ్లి యువకులు అరటిపళ్ల అత్తం.. అయ్యవారి చిత్తం అంటూ పాటలు పాడుతూ భోగి మంటలకు కావాల్సిన సామగ్రిని సిద్ధం చేసేవారు. అయితే కాలం మారుతున్న నేపథ్యంలో భోగి దుంగలు పోగుచేసే అవకాశం ఉండటం లేదు. అయినప్పటికీ పూర్వ ఆచారాన్ని కాపాడుకొంటూ కొంతమంది యువకులు దుంగలను పోగు చేస్తున్నారు. ఈ భోగి మంటల్లో చిన్న పిల్లలతో ఆవు పేడతో చేసిన భోగి దండలను వేయించడం ఆనవాయితీ.

బరితెగింపు



కోడి పందేలు, గుండాట కోసం తొత్తరమూడిలోని ఏర్పాటు చేస్తున్న బరులు



రావులపాలెంలో సీఆర్‌సీ రోడ్డులో కోడి పందేలకు ఏర్పాటు చేసి గ్రౌండ్

అయినవిల్లి: కూటమి నాయకుల ఆధ్వర్యంలో అయినవిల్లి మండలంలోని తొత్తరమూడి అగ్రహారం, సిరిపల్లి, విలస, మాగం, వీరవల్లిపాలెం గ్రామాల్లో కోడి పందాలు, గుండాటలకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే బరుల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. పెద్ద పెద్ద ఫోకస్ లైట్లు బిగించారు. రాత్రి, తెల్లవార్లు అనే తేడా లేకుండా కోడి పందాలు, గుండాట ఆడేందుకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశారు. రెవెన్యూ, పోలీసుశాఖల నుంచి ఏ విధమైన అనుమతులు లేనప్పటికి కూటమి నాయకులు బరితెగించి బరులు ఏర్పాటు చేశారు. సంక్రాంతికి దేశంలోని నలుమూలల నుంచి వచ్చే వారిని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేశారు. కోడి పందాలు, గుండాటపై ఆసక్తి ఉన్న వారి కోసం వాట్సాప్ స్టేటస్, గ్రూపుల్లో పోస్టులు పెట్టి మరి వారిని ఆహ్వానించే పనిలో ఉన్నారు.

కోడి పందాలు, గుండాటలకు భారీ ఏర్పాట్లు

రావులపాలెం: సంక్రాంతి నేపథ్యంలో కోడి పందేలు, గుండాటలు, పేకాటలు నిర్వహించేందుకు ఏర్పాట్లు భారీ స్థాయిలో జరుగుతున్నాయి. రావులపాలెం మండలంలో వెదిరేశ్వరం, రావులపాడు, దేవరపల్లి, పొడగట్లపల్లి, ఈతకోట గ్రామాల్లో నిర్వహకులు ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. పందేల నిర్వహణకు టెంట్లు, బారికేడ్లు, ఫెన్సింగ్ తదితర ఏర్పాట్లను ఆదివారం సాయంత్రానికి సిద్ధం చేశారు. అలాగే గుండాటల కోసం పదుల సంఖ్యలో బోర్డులు ఏర్పాటు చేశారు. ఇంత జరుగుతున్న అధికారులు బోధ్యం చేస్తున్నారు. కోడి పందేలు నిర్వహించకుండా సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్న నేపథ్యంలో కోడి పందేలపై ఉక్కుపాదం మోపుతామని పోలీసులు హెచ్చరించినా, చివరికి పందెం రాయుళ్లదే పైచేయి అయింది.

మళ్లీమళ్లీ.. ఇది రాని రోజు

అంబాజీపేట/మలికిపురం/మామిడికుదురు/సఖినేటిపల్లి/పి.గన్నవరం/ఆలమూరు: స్నేహ బంధం ఎంతో మధురమైనది. మొదటి స్నేహం ఏర్పడేది పాఠశాల స్థాయిలోనే.. ఎప్పుడు కలిసినా ఏరా.. పోరా అని ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనాటి మధుస్మృతులను గుర్తు చేసుకుంటూ గడుపుతారు. చిన్ననాటి స్నేహానుబంధాన్ని మరోసారి ఆత్మీయ కలయిక ద్వారా పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూలులో పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను దుశ్శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. బుద్ధులు నేర్పిన గురువులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.



అంబాజీపేటలో 1996-97 బ్యాచ్ విద్యార్థులు



మలికిపురంలో అధ్యాపకులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



లూటుకుర్రులో 1986-87 బ్యాచ్ విద్యార్థులు



పి.గన్నవరంలో 1985-86 బ్యాచ్ విద్యార్థులు



నరేంద్రపురంలో 1988-89 బ్యాచ్ విద్యార్థులు



ఆలమూరులో 1991-95 బ్యాచ్ విద్యార్థులు

హరిదాసుకు ఆర్థిక సాయం



హరిదాసు సుబ్బారావుకు ఆర్థిక సాయం అందించిన గ్రామస్తులు

మలికిపురం: హరినామ సంకీర్తనలతో అక్షయపాత్ర నెత్తిన పెట్టుకుని నాలుగు దశాబ్దాలుగా తమ గ్రామంలో ప్రతి ఇంటికీ తిరుగుతూ సంక్రాంతి శోభను తీసుకుని వచ్చే హరిదాసుకు గుడిమెళ్లంక గ్రామస్తులు రూ.56,500 ఆర్థిక సాయం చేసి హరిదాసుపై ఉన్న తమ భక్తిని చాటుకున్నారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి సంక్రాంతి ముగిసే వరకు ఇంటింటికీ నడచి వెళ్లి హరినామస్మరణతో సంస్కృతీ సంప్రదాయాలకు హరిదాసు కొల్లిపాక సుబ్బారావు ఆదర్శంగా నిలిచారు. దీంతో హరిదాసుపై ఉన్న అభిమానంతో హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సమితి సభ్యుల ద్వారా గ్రామస్తులు హరిదాసుకు అండగా నిలవాలని తలిచారు. వెంటనే చేయి చేయి కలిపి హరిదాసు కొల్లిపాక సుబ్బారావుకు ఆర్థిక సాయం చేసేందుకు వాట్సాప్ గ్రూప్ ద్వారా రూ.56,500 సేకరించి స్థానిక గ్రామ దేవత ఆలయం వద్ద హరిదాసుకు అందజేశారు. తనపై ఉన్న అభిమానంతో ఆర్థిక సాయం అందించి గ్రామస్తులందరికీ హరిదాసు సుబ్బారావు కృతజ్ఞతలు తెలిపారు.

కోలాహలంగా 'కొమ్ముల' వారి ఆత్మీయ కలయిక



పెదపట్నంలంకలో ఆత్మీయ సదస్సులో సరదా కోడి పందాలు

మామిడికుదురు: మన పాత మండువా లోగిలి పేరిట పెదపట్నంలంకలో ఆదివారం నిర్వహించిన కొమ్ముల వారి కుటుంబాల ఆత్మీయ కలయిక ఆద్యంతం కోలాహలంగా జరిగింది. చిన్నారులు నృత్యాలు చేసి అలరించగా మహిళలు కోడి పందాలు ఆడించి సందడి చేశారు. రావి ఆకులపై చిత్రించిన వివిధ రకాల దేవతామూర్తుల బొమ్మలను తోరణాలుగా ఏర్పాటు చేశారు. కొబ్బరాకులతో ఏర్పాటు చేసిన కళాకృతులు విశేషంగా ఆకట్టుకున్నాయి. సంప్రదాయ దుస్తులు దరించి మహిళలు సందడి చేశారు. సహపంక్తి భోజనాలతో పసందైన విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ఆద్యంతం కోలాహలంగా జరిగింది. ఉద్యోగాల రీత్యా సుదూర ప్రాంతాల్లో ఉంటున్న కొమ్ముల వారి కుటుంబ సభ్యులంతా ఈ వేదికను పంచుకుని అనురాగం, ఆప్యాయతలను పంచుకున్నారు.

యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద



పి.గన్నవరంలో వివేకాందుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కేశనపల్లిలో..



కొత్తపేట శిల్పా గార్డెన్‌లో..



జొన్నాడలో..



అంబాజీపేటలో..

అంబాజీపేట/పి.గన్నవరం/మలికిపురం/కొత్తపేట/అయినవిల్లిలమూరు: స్వామి వివేకానంద జీవితంతో పాటు ఆయన బోధనలను యువత ఆదర్శంగా తీసుకోవాలని అమలాపురం స్పెషల్ కోర్టు జడ్జి పులిదిండి వెంకట ప్రసాద్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో వివేకానంద జయంతిని ఆదివారం నిర్వహించారు. పి.గన్నవరంలోని శింగంశెట్టి ప్రభావతి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం వివేకానందుడి జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. మలికిపురం మండలం కేశనపల్లిలో స్థానిక గీతా మందిరం వద్ద ఉన్న వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కొత్తపేటలో అంతర్జాతీయ శిల్పి రాజ్‌కుమార్ వుడయార్ ఆధ్వర్యంలో వివేకానందుని జయంతి నిర్వహించారు. వివేకానందుని విగ్రహానికి శిల్పి ఉడయార్, యోగా గురువు ఆకుల శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించారు. ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు యువకులు రక్తదానం చేశారు. అయినవిల్లి మండలం నేదునూరులో రావి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ కార్యదర్శి పాలగుమ్మి వెంకటకృష్ణ అధ్యక్షతన స్వామి వివేకానంద జయంతి చేశారు. అలాగే మండలంలోని కె.జగన్నాథపురంలో వివేకానంద జయంతిని జరిపారు. ఆలమూరు మండలంలోని జొన్నాడలో నల్లమిల్లి రామారెడ్డి ఆధ్వర్యంలో వివేకానందుని జయంతి నిర్వహించారు. పలువురు వక్తలు వివేకానందుడి జీవిత విశేషాలను, ఆయన బోధనలను వివరించారు.

పుష్పాలంకరణలో అయినవిల్లి



అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో ఏర్పాటు చేస్తున్న పుష్పాల సెట్టింగ్

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయం సంక్రాంతి వేడుకలకు పుష్పాలంకరణతో సర్వాంగ సుందరంగా ఆలయ అధికారులు తీర్చిదిద్దుతున్నారు. స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలను కల్పిస్తున్నారు. ఇప్పటికే బారికేడ్లు ఏర్పాటు చేశారు. పోలీసు బందోబస్తుకు చర్యలు చేపట్టారు. ఆలయం అంతా పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద, స్వామి వారి మండపంలోని గర్భగుడి ద్వార వద్ద, ఆలయం వెనుక భాగంలో పుష్పాలతో భారీసెట్లు ఏర్పాటు చేశారు.

నేడు ఢిల్లీలో గరగ నృత్య ప్రదర్శన



ఢిల్లీలో గరగ నృత్య ప్రత్యేక ప్రదర్శన ఇవ్వనున్న కళాకారులు

అంబాజీపేట: ఈ నెల 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన ముక్కామల గరగ నృత్య కళాకారుల బృందం ఈ నెల 13న పీఎం మోదీ ఎదుట ప్రత్యేక ప్రదర్శన ఇవ్వనున్నట్లు గరగ నృత్య బృంద ట్రూప్ లీడర్ పసుపులేటి అయ్యప్పస్వామి ఆదివారం తెలిపారు. రిపబ్లిక్ పరేడ్ నిర్వాహకుల నుంచి ఆహ్వానం అందడంతో ఇప్పటికే 100 మంది కళాకారులతో ఢిల్లీలో ప్రాక్టీస్ చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి ఈ నెల 13న ప్రధానమంత్రి మోదీ వద్ద గరగ నృత్య ప్రదర్శన ఇవ్వనున్నామన్నారు. ఈ నృత్య ప్రదర్శనను కేంద్ర సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ ద్వారా ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రదర్శన ఇవ్వనున్నామన్నారు. 2010లో తన తండ్రి పసుపులేటి వెంకటేశ్వరావు రిపబ్లిక్ పరేడ్‌లో సభ్యుడిగా పాల్గొన్నారని అయ్యప్పస్వామి తెలిపారు. అప్పటి నుంచి గరగ నృత్యంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు.

అలరించిన గొబ్బెమ్మలు



అంబాజీపేటలో అలరించిన చిన్నారుల గొబ్బెమ్మలు

అంబాజీపేట: రానున్న సంక్రాంతి పండగను పురస్కరించుకుని ధనుర్మాసంలో నిర్వహించిన చిన్నారుల గొబ్బెమ్మల పూజలు ఎంతో అలరించాయి. అంబాజీపేట పెద్ద వీధిలోని దీక్షిత్‌నగర్‌కు చెందిన వాడ్రేవు సూర్యనారాయణమూర్తి, సత్యభాను దంపతుల కుమార్తె సత్య రేణుకతో ఆదివారం గొబ్బెమ్మలు పెట్టించారు. కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న నాయకులు

అయినవిల్లి: మండలంలోని మాగం, విలస గ్రామాల్లో మినీ క్రికెట్ టోర్నమెంట్ కమిటీ వారి ఆధ్వర్యంలో సుమారుగా వారం రోజులుగా క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. ఆదివారం అమలాపురం జట్టు విన్నర్‌గా నిలిచింది. అమలాపురం ఎర్రవంతెన జట్టు రన్నర్‌గా నిలిచింది. ఇరు జట్లకు ఈ మినీ క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథులుగా విలస, మాగం సర్పంచ్‌లు కుసుమ లిల్లీ మంగేష్కర్, కాశీ వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు. అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చేట్ల రామారావు కమిటీ వారి ఆధ్వర్యంలో విన్నర్‌కి రూ.20 వేల ప్రైజ్‌మనీ, ట్రోఫీ అందించారు. రన్నర్‌కి రూ.10 వేల ప్రైజ్‌మనీ అందజేశారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రావులపాలెం: లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ఏపీ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి అన్నారు. స్థానిక సాయిరాం హాస్పిటల్ వద్ద ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి కంటి పరీక్షలు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కర్రి సుబ్బారెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డి జన్మదినం సందర్భంగా 50 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. అలాగే పది మంది హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు అందజేశారు. కార్యక్రమంలో నందం వీవీ సత్యనారాయణ, మన్యం ప్రదీప్, చిర్ల కనికిరెడ్డి, కర్రి శ్రీరామ చంద్రారెడ్డి, నాగరాజు, గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎల్.గన్నవరంలో విషాదఛాయలు

పి.గన్నవరం: కాకినాడ జగన్నాథపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పి.గన్నవరం మండలం ఎల్.గన్నవరానికి చెందిన డేగల రేణుక (18) మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రేణుక జగన్నాథపురంలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ కంప్యూటర్ కోర్సు చదువుతోంది. సంక్రాంతి పండుగ కోసం శనివారం రాత్రి బట్టలు కొనుగోలు చేసి తాతయ్యతో కలసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా లారీ ఢీకొనడంతో ఆమె మృతి చెందింది. దీంతో పండగపూట ఎల్.గన్నవరంలో విషాదం అలుముకుంది. తల్లిదండ్రులు కుమార్తె మృతదేహం వద్ద బోరున విలపించారు. రేణుక తండ్రి ఏడుకొండలు 10 టీవీ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు.